క్లుప్తంగా

పాఠశాలలకు ఐఎఫ్‌పీ టీవీలు మంజూరు

శిరివెళ్ల: విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెస్తుంది. కార్పొరేట్ పాఠశాలల స్థాయి వసతులు, సౌకర్యాలను సమకూరుస్తుంది. తాజాగా ప్రతి పాఠశాలకు, ప్రతి తరగతి గదికి ఐఎఫ్‌పీ టీవీలను సరఫరా చేసింది. టీచర్ పాఠాలను చెప్పేటప్పుడు దానికి అవసరమైన కూలంషంగా విద్యార్థులకు కనులకు కట్టినట్లు బొమ్మల ఆధారంగా బోధన చేస్తారు.

సచివాలయాల్లో జూమ్ మీటింగ్

శిరివెళ్ల: ప్రతి సోమవారం జిల్లా, మండల స్థాయిలో జరిగే వీడియో కాన్ఫరెన్స్ ఇక నుంచి గ్రామ సచివాలయాల్లో కూడా జరగనుంది. సచివాలయాల్లో టీవీలు లేకపోవడంతో వాటి స్థానంలో జూమ్ మీటంగ్ ఏర్పాటు చేశారు. ఇందుకు సచివాలయాలకు యాప్ ఇచ్చారు. సోమవారం మండలంలోని సచివాలయాల్లో ఉదయం 9గంటలకే జూమ్ మీటింగ్‌కు సిబ్బంది హాజరయ్యారు. స్పందనకు వచ్చిన అర్జీలపై సంబంధిత సచివాలయ కార్యదర్శిని నేరుగా కలెక్టర్ అడిగే అవకాశం ఉంది. ఏ గ్రామం నుంచి ప్రజలు అర్జీలు ఇచ్చారో ఆ గ్రామ సచివాలయ సిబ్బంది వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

ఆర్థిక సాయం

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికుడికి సీఐటీయూ ఆధ్వర్యంలో రూ.60వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలవెంకట్, ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌కే బాషా, వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుడు బికారి ఇటీవల పని చేస్తూ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స చేయించినా నయం కాకపోవడంతో ఆర్థిక సాయం చేసినట్లు చెప్పారు. నూర్ అహమ్మద్, రహిమాన్, రషీద్, బాలయ్య, కుమార్, దస్తగిరి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 31 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం పోస్టర్లను విడుదల చేశారు.

పని భారం తగ్గించాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలో పని చేస్తున్న ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలని నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి శ్రీనివాసులు అధ్యక్షతన వహించగా ముఖ్యఅతిథిగా జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు శివ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుజాత మాట్లాడారు. ఆశా వర్కర్లతో సంబంధం లేని పనులు చేయిస్తున్నారన్నారు. మండల కార్యదర్శి కుళాయిస్వామి, సంజీవులు, రవి, ఆశా వర్కర్లు జనాబీ, జ్యోతి, కృపావతి, నాగవేణి, సంజీవకుమారి పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ

ఉయ్యాలవాడ : ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద వంద శాతం సబ్సిడీతో పండ్ల మొక్కలను రైతులకు అందజేస్తుందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం మండలంలోని రైతులకు 4,385 కొబ్బరి, 132 నిమ్మ మొక్కలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వంద శాతం సబ్సిడీతో 17 రకాల ఉద్యానవన పంటలకు సంబంధించిన మొక్కలను అందజేస్తున్నామన్నారు. ఏపీఓ రవిప్రకాష్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


నాటుసారా విక్రేత అరెస్ట్

రుద్రవరం: ఆలమూరు గ్రామానికి చెందిన నాగూర్‌బాషా నాటుసారా విక్రయిస్తుండగా అరెస్ట్ చేశామని ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలి పారు. కొంత కాలంగా నాగూర్‌బాషా నాటు సారా విక్రయిస్తున్నాడని సమాచారం ఉందని, ఆయనపై నిఘా ఉంచగా, సోమవారం సారా తరలిస్తుండగా నర్సాపురం మెట్ట వద్ద దాడి చేసి అదుపులోకి తీసుకొని 10లీటర్ల నాటుసారా స్వాధీం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు వివరించారు.

కలెక్షన్ సెంటర్ నిర్మాణం

ఉయ్యాలవాడ : స్థానిక కూరగాయల మార్కెట్‌లో రూ.15 లక్షలతో ఉద్యానవన సాగు ఉత్పత్తుల మార్కెటింగ్ కలెక్షన్ సెంటర్‌ను ప్రభుత్వం నిర్మిస్తోంది. సోమవారం నిర్మాణ పనులను ఉద్యానవన శాఖ అధికారిణి ధరిణి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఉయ్యాలవాడలో రేనాటి సూర్యచంద్రుల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టామన్నారు. ఈ కలెక్షన్ సెంటర్ యూనిట్ కాస్ట్ రూ. 15లక్షలు కాగా సబ్సిడీ 75 శాతం రూ. 11.25 లక్షలు కాగా 25 శాతం సంఘంలోని సభ్యులు భరించాల్సి ఉంటుందన్నారు. ఈ కలెక్షన్ సెంటర్ ద్వారా కూరగాయలు, పండ్లు, పూలు, మిరప దిగుబడులు సేకరించి పంట ఉత్పత్తులను నేరుగా అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు.

గండి పూడ్చివేత



శిరివెళ్ల: శిరివెళ్ల మెట్ట వద్ద కేసీ కెనాల్ శిరివెళ్ల సబ్‌ఛానల్‌పై పడిన గండిని సోమవారం ఎంపీపీ నాయక్ వసీం సమక్షంలో అధికారులు పూడ్చి వేశారు. గతేడాది అధిక వర్షాలకు జాతీయ రహదారి ఆనుకొని ఉన్న బ్రిడ్జి వద్ద కాలువ సైడ్ కట్టకు గండి పడింది. ఖరీఫ్, రబీ పంటల కాలంలో పూడ్చడానికి వీలు కాలేదు. సమస్యను ఎంపీపీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు కేసీ కెనాల్ డీఈఈ సుబ్రహ్మణ్యంరెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది గండి పూడ్చివేశారు.

> ‘‘విద్యతోనే సమాజంలో ఆర్థిక అసమానతలను రూపుమాపగలం.. పిల్లలను చక్కగా చదివిస్తే పేద కుటుంబాల్లో వెలుగులు నింపగలం.. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుబాటులోకి తీసుకొస్తే పోటీ ప్రపంచంలో దీటుగా నిలబడే ఆత్మస్థైర్యాన్ని అందించగలం’’
>
> – సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



ఈ చిత్రంలో తన కుమార్తె వెంకటలక్ష్మిని బడిలో దించేందుకు వచ్చిన మహిళ పేరు కల్యాణి. వీరిది యాదవాడ గ్రామం. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నారు. ఈమెకు కూతురు, కుమారుడు సంతానం. కుమారుడు ముత్యాలపాడు ప్రైవేటు పాఠశాలలో చదువుతుండగా, కుమార్తె గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. మూడేళ్ల నుంచి ఏటా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందజేసే జగనన్న అమ్మ ఒడి పథకం డబ్బులు ఆమె ఖాతాలో జమవుతున్నాయి. ఈ మొత్తం అందుతుండటంతో పిల్లల చదువుకు ఆర్థిక ఇబ్బందులు తప్పాయని ఆనందంగా చెబుతోంది.



ఈ ఫొటోలో మూడో తరగతి చదువుతున్న కుమారుడు హర్షవర్ధన్‌ను స్కూల్‌కు పంపేందుకు సిద్ధం చేస్తున్న తల్లి పేరు ఓబులమ్మ. వీరిది దొర్నిపాడు మండలం క్రిష్టిపాడు గ్రామం. ఈమెకు ఇద్దరు పిల్లలు. కుమార్తె ఒకటో తరగతిలో చేరింది. ఇద్దరూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈమె ఖాతాలో రెండేళ్లుగా అమ్మ ఒడి పథకం డబ్బులు జమవుతున్నాయి. ప్రభుత్వం అందజేస్తున్న నగదుతో పిల్లలను సంతోషంగా చదివిస్తున్నానని, ఆర్థికంగా ఆదుకుంటున్న జగనన్నకు రుణపడి ఉంటామని చెబుతోంది.

నూతన ఒరబడి

- ‘అమ్మఒడి’ తో పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువుకు ఆర్థిక భరోసా
- నాలుగో ఏడాది విద్యార్థుల తల్లుల ఖాతాలో రూ.36.106 కోట్లు జమ
- నియోజకవర్గంలో 22,718 మంది లబ్ధిదారులు
- నాలుగేళ్లలో సుమారు రూ.140 కోట్లు లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



యాదవాడలో ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులు

ఆళ్లగడ్డ: పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలి, వారికి కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్యనందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. ఎందరో విద్యార్థులు ఆర్థిక స్థోమత లేక విద్యకు దూరమవుతుండటం, ఒకవేళ బడిలో చేర్పించినా చదువును కొనసాగించలేక తల్లిదండ్రులు మధ్యలోనే మాన్పిస్తున్నారు. ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో పిల్లలను బడికి తీసుకురావాలంటే తల్లికి ఆర్థిక బలం కావాలని గుర్తించి అమ్మ ఒడి పథకానికి శ్రీకారం చుట్టారు. తన పిల్లలను బడికి పంపే ప్రతి పేద తల్లి బ్యాంక్ ఖాతాలో ఏడాదికి రూ.15వేలు జమ చేస్తున్నారు. ఇలా క్రమం తప్పకుండా ఇటీవల నాలుగో ఏడాది సొమ్ము కూడా తల్లుల ఖాతాలో జమ చేశారు. ఈమొత్తం విద్యార్థుల తల్లులకు కొండంత అండగా నిలుస్తోంది.

నియోజకవర్గంలో..

మూడు దఫాలుగా నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలోని 91 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోరూ.103.894 కోట్లు తల్లుల ఖాతాలో జమయ్యాయి. నాలుగో ఏడాది 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 22,718 మంది తల్లుల ఖాతాల్లో రూ.36.106 కోట్లు జమ చేయడంతో విద్యార్థులు,తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డీటీఎంఎఫ్‌నకు రూ.వెయ్యి..

అమ్మఒడి విడుదలయ్యే రూ.15వేలల్లో.. రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుంది. మిగిలిన రూ.2వేలను.. డిస్ట్రిక్ట్ టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్ (డీటీఎంఎఫ్)కు రూ. వెయ్యి, డిస్ట్రిక్ట్ స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ (డీఎస్ఎంఎఫ్)కు రూ. వెయ్యి జమ చేస్తుంది. ఇలా విద్యార్థులకు వసతులు కల్పించడంలో వారిని కూడా భాగస్వామ్యం చేస్తుంది. జిల్లా కలెక్టర్ నియంత్రణలో డీటీఎంఫ్, డీఎస్ఎంఎఫ్ నిర్వహించబడుతాయి.



చాగలమర్రి కేజీబీవీలో తరగతులకు వస్తున్న బాలికలు

మండలాల వారీగా నాలుగో విడత జగనన్న అమ్మఒడి లబ్ధిదారులు, జమైన మొత్తం..

మండలం	సచివాలయాలు	లబ్ధిదారులు	జమైన నగదు (రూ.కోట్లల్లో)
ఆళ్లగడ్డ	22	7,786	10.122
చాగలమర్రి	17	5,049	6.564
దొర్నిపాడు	9	2,245	2.919
శిరివెళ్ల	16	5,600	7.280
ఉయ్యాలవాడ	11	2,038	2.649
రుద్రవరం	16	5,055	6.572
మొత్తం	91	22,718	36.106

వైభవంగా చౌడేశ్వరి దేవి జయంతి





ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి దేవి, బోనాలను సమర్పించడానికి వెళ్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక బైటిపేటలో వెలసిన శ్రీచౌడేశ్వరి దేవస్థానంలో ఆషాడ మాస బహుళ అమావాస్య, అమ్మవారి జయంతి వేడుకలను శ్రీచౌడేశ్వరి దేవి సేవా సమితి సభ్యులు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంరించారు. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి మహా మంగళ హారతులు ఇచ్చారు. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి గ్రామోత్సవం జరిపించారు.

గోస్పాడు: చౌడేశ్వరి మాత జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. యాళ్లూరు-శ్రీనివాసపురం గ్రామాల మధ్య వెలసిన చౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. యాళ్లూరులో పెద్ద బావి వద్ద వెలిసిన చౌడేశ్వరికి భక్తులు బోనాలు సమర్పించారు.

చాగలమర్రి: మండల కేంద్రంలోని చిన్న మకానం వీధి సమీపంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ధర్మకర్త బడిగెంచల చక్రపాణి, సభ్యులు దామోదరుడు, రఘురాం, సుబ్బనర్సయ్య, ప్రదీప్, నారాయణల ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు, సామూహిక వడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అమ్మవారికి వాసవి కన్యకాపరమేశ్వరి మహిళా మండలి సభ్యులు సామూహిక పారాయణం చేపట్టారు. పూజల్లో ఎంపీపీ వీరభద్రుడు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు ప్రశంసనీయం



ఉచిత శస్త్ర చికిత్సల శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మధుమణి నర్సింగ్ హోం ఆధ్వర్యంలో 32 సంవత్సరాలుగా పేద ప్రజలకు ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించడం ప్రశంసనీయమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం డాక్టర్ మధుసూదనరావు తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా 33వ ఉచిత ముక్కు, చెవి, గొంతు శస్త్ర చికిత్స శిబిరాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ అత్యంత ఆధునిక పరికరాలతో ఆసుపత్రి ఏర్పాటు చేసి సాధారణ ప్రజలకు అందుబాటులో వైద్యం అందజేయడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు డాక్టర్ మధుసూదనరావు, మణిదీప్ మాట్లాడుతూ వారం రోజుల్లో వంద మందికి పైగా రూ.50లక్షలు విలువజేసే చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సలను ఉచితంగా చేస్తున్నామన్నారు. రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, వైద్యులు నాగమణి, మధుప్రీతి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, సహదేవుడు, మార్కెట్‌యార్డు చైర్మన్ మహేశ్వర రెడ్డి, డాక్టర్ జఫరుల్లా, చంద్రశేఖర్, డాక్టర్ ఫసీల్, శేషఫణి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

హామీల అమలులో జగనన్నకు సాటిలేరు



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

గోస్పాడు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలోనే నూతన అధ్యాయం సృష్టించారని, ఈ విషయంలో ఆయనకు సాటి రాగల నాయకుడు లేరని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జూలేపల్లే గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడప తిరిగి లబ్ధిదారులకు బుక్ లెట్ అందజేసి పథకాలను వివరించి సమస్యలను తెలుసుకున్నారు. కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. మరొకొన్ని త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే నంద్యాలతో పాటు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, ఇంకా చేస్తామన్నారు. మెడికల్ కాలేజీ, ఆసుపత్రి లాంటివి ప్రజలకు శాశ్వతంగా ఉత్తమ సేవలందిస్తాయని, నంద్యాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, ప్రహ్లాద రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్ పుల్లయ్య, ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ పార్థసారధిరెడ్డి, నాయకులు రాజారెడ్డి, కాంతారెడ్డి, రామసుబ్బారెడ్డి, రామనాథరెడ్డి, కృష్ణయ్య మండల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): డోన్ నుంచి సోమయాజులపల్లె వరకు జాతీయ రహదారి పనుల్లో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్ కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ డోన్ నుంచి సోమయాజులపల్లె వరకు డోన్, బేతంచెర్ల, ఓర్వకల్లు మండలాలకు చెందిన 360 మంది రైతుల నుంచి 135 ఎకరాలకు నష్టపరిహారం చెల్లించకుండా సేకరించి రూ.630 కోట్లకు టెండరు వేసి పనులు ప్రారంభించడం సరికాదన్నారు. శ్రీనివాసులు, మోటా రాముడు, నాగరాముడు, సోమన్న, ప్రభాకర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఫైనాన్స్ సంస్థల ఆగడాలను అరికట్టాలి..

జిల్లాలో ప్రైవేటు, ఆటో, బైక్ ఫైనాన్స్‌ల ఆగడాలను అరికట్టాలని జిల్లా కలెక్టర్, ఎస్పీకి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏర్పడిన తర్వాత పుట్టగొడుగుల్లా ఆటో, బైక్ ఫైనాన్స్‌లు వెలిశాయని, అనుమతులు లేకుండా ఎక్కువ మొత్తంలో వడ్డీలు వసూలు చేస్తున్నారన్నారు. యూనియన్ నాయకులు ఖాజా, రామచంద్రుడు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

దొర్నిపాడు:అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని జెడ్పీటీసీ శకుంతల సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం చిన్నారులకు మధ్యాహ్నభోజనం ఏర్పాటు చేయాలని చెప్పారు.

పండ్ల మొక్కలతో దీర్ఘకాలిక ఆదాయం

ఆళ్లగడ్డ: రైతులకు వ్యవసాయం కన్నా సుదీర్ఘకాలం ఆదాయం ఇచ్చేవి పండ్ల మొక్కలేనని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో వచ్చిన టెంకాయ మొక్కలను రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు పొలాల గట్లు, పండ్ల తోటల్లోని ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటుకునేందుకు దరఖాస్తు చేసుకున్న 20 మంది రైతులకు 2,120 టెంకాయ మొక్కలను అందజేశామన్నారు. ఏపీఓ గణేష్ పాల్గొన్నారు

నవరత్నాలతో ప్రతి ఇంటా సంతోషం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

దొర్నిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలతో ప్రతి గడపలో ఆనందాల హరివిల్లు విరబూస్తోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. సోమవారం చాకరాజువేముల సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, సంక్షేమ పథకాలు అందాయా? లేదా? అని ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ఇప్పటి వరకు సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపే బుక్‌లెట్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో 2,546 మంది లబ్ధిదారులకు రూ. 3.77 కోట్లను పథకాల కింద ఖర్చు చేసిందన్నారు. ఆసరా 1018, అమ్మఒడి 419, వైఎస్సార్ సున్నావడ్డీ 536, వైఎస్సార్ చేయూత 237, వైఎస్సార్ రైతు భరోసా 432 లబ్ధి పొందారన్నారు. ప్రతి ప్రజా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇలాంటి పాలన చిరకాలం ఉండేలా ప్రజలు మరోసారి జగనన్నను ఆశీర్వాదించాలని కోరారు.కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు యాదవ్, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, సర్పంచ్ పద్మిని, ఎంపీటీసీ షాజహాన్, సచివాలయ మండల కన్వీనర్ శివారెడ్డి, నాయకులు మోహన్‌నాయుడు, లక్కు చంద్రశేఖర్ రెడ్డి, కాకర్ల, వెంకటసుబ్బనాయుడు, పెద్ద రామచంద్రుడు, గోవిందపల్లె మాబాషా, మహబూబ్‌బాషా, మైనుద్దీన్, విజయసింహచౌదరి, బోయిన శ్రీనివాసులు,, సుబ్బయ్య, భూమా రామక్రిష్ణారెడ్డి, బొ బ్బూరి పుల్లారెడ్డి, గుర్రప్ప, లక్కు చంద్రశేఖర్‌రెడ్డి కాకనూరు మనోహర్‌రెడ్డి, చిన్న వెంకటరామిరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వరప్రసాద్, భూమా శ్రీనివాసరెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీపతి ప్రసాద్, ఎంపీడీఓ సుబ్బా రెడ్డి, ఏఓ సునీత, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ సుప్రియ, రీసోర్స్ కోఆర్డినేటర్ జర్మియా పాల్గొన్నారు.

ఉచితంగా గుండె ఆపరేషన్ చేయిస్తాం..

గ్రామానికి చెందిన సుభాన్ గత కొద్దిరోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. గడప గడపలో వారి ఇంటిని సందర్శించినప్పుడు ఎమ్మెల్యేకు సమస్యను వివరించగా.. వివరాలన్నీ అందజేయాలని వెంటనే ఉచితంగా వైద్యం చేయిస్తానని హామీ ఇచ్చారు.

శాకాంబరిగా అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): ఆషాడ మాసం చివరి రోజు సోమావతి అమావాస్యను పురస్కరించుకొని కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో సోమవారం కాళికాంబను వివిధ కూరగాయలతో శాకాంబరిగా అలంకరించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే అమ్మవారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకించి శాకాంబరిగా అలంకరించారు. ఆలయ ఆవరణలోని ఆంజనేయస్వామికి ప్రత్యే పూజలు చేశారు. అలాగే సంజీవనగర్ రామాలయంలో కాశీవిశాలాక్షి అమ్మవారికి భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. వేదపండితులు యాదవల్లి కార్తికేయశర్మ మాట్లాడుతూ కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అర్చించడం వల్ల సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని చెప్పారు.

వర్షం కోసం ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): సకాలంలో వర్షాలు కురవాలని కోరుతూ పట్టణంలోని కాళికాంబ దేవస్థానంలోని ఖాళీ మాత సేవా సమాజ్ నిర్వాహకులు అమ్మవారికి 108 కలశాలతో జలాభిషేకం చేశారు. సోమవారం సాయంత్రం 108 మంది మహిళలు చెరువు కట్ట నుంచి 108 కలశాలతో ఊరేగింపుగా అమ్మవారి పాదాలకు అభిషేకం చేపట్టారు. అలాగే శ్రీచంద్రశేఖర స్వామికి అభిషేకాలు చేశారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి

నంద్యాల(అర్బన్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సంఘం నాయకులు కల్యాణ్ చక్రవర్తి కోరారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, సీపీఎం నాయకులతో కలిసి సోమవారం నంద్యాల జిల్లా సర్కిల్ ఆఫీసు ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రకృతిని ప్రేమిస్తేనే మానవ మనుగడ

చాగలమర్రి: ప్రకృతిని రక్షించి ప్రేమించనప్పుడే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఆశుతోష్ పాండే పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆశుతోష్ పాండే పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన భారతదేశ పాదయాత్ర సోమవారం చాగలమర్రి చేరుకుంది. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 4న యాత్రను అయోధ్యలో మొదలుపెట్టానని, ఇప్పటి వరకు 5,600 కి.మి. పూర్తి చేసుకున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న నవజీవన్ పాఠశాలలో ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ అలియావర్‌జెంగ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజేబులిటీ ముంబై వారి సమష్టి సహకారంతో ఉపాధ్యాయ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. కోర్సు వ్యవధి రెండు సంవత్సరాలు, ఇంటర్మీడియెట్, ఎస్‌ఐఓఎస్ పూర్తి చేసిన వారు కోర్సుకు అర్హులన్నారు. ఈ కోర్సును పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సర్వశిక్ష అభియాన్‌లో ఉద్యోగం లభిస్తుందన్నారు. ఈ విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ఈనెల 19వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9989415966, 8688101363 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యేలు కాటసాని, శిల్పా రవి

నంద్యాల(అర్బన్): గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల మండలంలోని బిల్లాలాపురం–కొత్తపల్లె–భీమవరం గ్రామాల మధ్య రూ.3.65 కోట్లతో ఏర్పాటు చేసిన బీటీ రోడ్డును ఎంపీ పోచా, ఎమ్మెల్యేలు కాటసాని, శిల్పా రవి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాల అనుసంధానించడానికి నూతనంగా బీటీ రహదారులను వేస్తున్నామన్నారు. ఎంపీ మాట్లాడుతూ పీఎంజీఎస్‌వై ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ సచివాలయాల వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లపై ప్రతిపక్షం చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదన్నారు. ఏపీఎస్పీడీసీఎస్ రాష్ట్ర డైరెక్టర్ శశికళారెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, కొత్తపల్లి ఎంపీటీసీ హరినాథ్‌రెడ్డి, బిల్లాలాపురం సర్పంచ్ సుబ్బయ్య, నాయకులు తాడి నరేంద్రారెడ్డి, బాల వెంకట్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పాణ్యం మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ రెడ్డి, నంద్యాల మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్ధం శివరాం పాల్గొన్నారు.

విత్తనాల ఎంపిక కీలకం



మొక్కజొన్న విత్తన మొలక శాతం నిర్ధారణ చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: పంటల సాగులో రైతులు మేలు రకం విత్తనాలను ఎంపిక చేసుకోవడమే కీలకమని సహాయ వ్యవసాయ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో విత్తన, రసాయనిక ఎరువుల నమూనాల పరీక్షలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పరీక్షించేందుకు ఏర్పాటుచేసిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. రైతులు తీసుకు వచ్చిన విత్తనాలు, ఎరువుల నాణ్యతా ప్రమాణాలు, తేమ, మొలకశాతం తెలుసుకునేందుకు ఉచితంగా పరీక్షలు చేసి ఫలితాలను పది రోజుల్లోపు అందిస్తామని చెప్పారు. ఈ ఏడాది 570 విత్తన శ్యాంపిళ్ల , 117 రసాయనిక ఎరువుల నమూనాలను పరీక్షించి రైతులకు ఫలితాలు అందజేశామన్నారు. ల్యాబ్ అనలిస్ట్ నాగేంద్రప్రసాద్ ఉన్నారు.

సేవల్లో ఆదర్శం



కరోనా సమయంలో బాధితురాలి యోగక్షేమాలు తెలుసుకుంటున్న వలంటీర్ ఖాసిం, ఆరోగ్య సిబ్బంది

ఆళ్లగడ్డ మండలం ఓబులపంల్లి గ్రామానికి చెందిన వలంటీర్ ఖాసిం సేవలు పలువురికి ఆదర్శంగా నిలిచాయి. కరోనా సమయంలో నా అన్న వారు.. రక్త సంబంధీకులు సైతం దగ్గరకు వచ్చి పలకరించేందుకు వెనుకంజ వేస్తున్న సమయంలో ప్రభుత్వ ఆదేశాలతో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా ఉంటూ కరోనా బాధితులు, అనుమానితుల ఇళ్ల వద్దకు ధైర్యంగా, ప్రాణాలకు తెగించి వెళ్లి వారి యోగ క్షేమాలు తెలుసుకొని, అవసరమైతే వైద్య, ఆరోగ్య సిబ్బందిని వెంట తీసుకెళ్లి వారికి అవసరమైన మందులు పంపిణీ చేసి శభాష్ అనిపించుకున్నాడు. అలాగే దాతలు అందించిన నిత్యావసర వస్తువులు, కూరగాయలు, ఆహార పదార్థాలు తన పరిధిలో లేని వారి ఇళ్లకు సైతం చేర్చి గుర్తింపు పొందాడు. – ఆళ్లగడ్డ



ఎంత చెప్పినా తక్కువే

> కరోనా వచ్చిన మొదట్లో ప్రజలు బయట తిరగడానికి భయపడ్డారు. అలాంటి కష్ట కాలంలో మా వలంటీర్ ఖాసిం మా ఇళ్ల దగ్గరకు వచ్చి మాకు అన్ని విధాలుగా అండగా నిలిచాడు. డాక్టర్లను తీసుకొచ్చి మాకు సలహాలు, సూచనలు ఇప్పించాడు. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే.
>
> – దస్తగిరమ్మ, ఓబులంపల్లె